


16న ఎఫ్ఆర్ఒ ఉద్యోగాలకు రాతపరీక్ష

17న జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు..

ప్రజాశక్తి-విజయనగరం

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ ఉద్యోగాల భర్తీకి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే రాతపరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 17న జరిగే పరీక్షకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ రెండు పరీక్షలకు సంబంధించి తమ ఛాంబర్లో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటలు వరకు జరుగుతాయని చెప్పారు. చింతలవలసలోని ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాల, గాజులరేగలోని అయాన్ డిజిటల్‌లో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కలెక్టరేట్ పరీక్షల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, వివిధ శాఖల ప్రతినిధులు, ఎపిపిఎస్‌సి అధికారులు పాల్గొన్నారు.

పేదల అవసరాల గుర్తింపునకే

- పి4 సర్వేపై జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్ బాబు
- ఐదేళ్ల ప్రణాళికలు ఆచరణాత్మకంగా ఉండాలని ఆదేశం
- ప్రతి పంటకు ప్రణాళిక ఉండాలి : మంత్రి కొండపల్లి
- పి 4, స్వర్ణాంధ్ర విజన్ 2047పై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు

ప్రజాశక్తి-విజయనగరం

పబ్లిక్, ప్రైవేటు , పీపుల్ పార్టిసిపేషన్ -పి 4 పేరుతో నిర్వహిస్తున్న సర్వే కేవలం పేదవారి అవసరాలను గుర్తించడానికే నని, సంక్షేమం ఆగిపోతుందేమోననే అపోహలు వద్దని రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఇ ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పి 4 సర్వే ద్వారా జిల్లాలో 20 శాతం పేదవారికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించి వారికి చేయూత నిస్తామని తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పి4 సర్వే, స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా నియోజకవర్గం అభివృద్ధికి విజన్ ప్లాన్ తయారీపై మంత్రి, జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.బాబు ఆధ్వర్యంలో అధికారులతో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో పి4 సర్వే 78 శాతం వరకు పూర్తయ్యిందని , మిగిలిన సర్వే మరో రెండు రోజుల్లో అధికారులు పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఒంటరిగా అన్ని పనులు చేయలేదని, ప్రజల భాగస్వామ్యంతో పేదల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోందని తెలిపారు.

విజన్ ఆంధ్ర 2047 ప్రణాళిక లో నియోజకవర్గం ప్రణాళిక తయారీ లో గజపతినగరం నియోజకవర్గంపై తయారు చేసిన మోడల్ ప్రణాళికను సిపిఒ వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలో ఆయిల్ పామ్ పంట అధికంగా ఉందని, పరిశ్రమ పెట్టడానికి అనేక మంది సిద్ధంగా ఉన్నారని, జిల్లాలో ఆయిల్ పామ్ పై సమగ్ర ప్రణాళిక ను తయారు చేయాలని తెలిపారు. ప్రతి పంటకు ఒక సమగ్ర ప్రణాళిక ఉండాలని అన్నారు. ప్రతి మండల కేంద్రం లో ఒక బిజినెస్ సెంటర్ ను ఏర్పాటు చేయడానికి 2 ఎకరాల భూమిని గుర్తించాలని తెలిపారు. జిల్లాలో పర్యాటకాభివద్ధికి విస్తత అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా తాటిపూడి జలాశయం వద్ద పర్యాటకుల కోసం సౌకర్యాలను కల్పించవలసి ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందిస్తూ తాటిపూడి వద్ద బోటు విహార యాత్ర ద్వారా 2 నెలల్లో 35 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని, బోటింగ్‌కు మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. చింతపల్లి బీచ్ వద్ద నున్న 3 కాటేజీ లను పిపి మోడల్ లో అభివృద్ధి చేయడానికి, రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామన్నారు. రామతీర్థం లో టెంపుల్ టూరిజం కింద 10 కోట్లతో అభివద్ధి చేయడానికి కూడా ప్రతిపాదనలు పంపామన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ మామిడి రైతులకు ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన శిక్షణ అవసరమని తెలిపారు.

వాస్తవ ప్రణాళికలు ఉండాలి

జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్ బాబు మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లకు ప్రతి శాఖ వాస్తవ, ఆచరణాత్మకమైన ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రోగ్రాం లు, ప్రాజెక్టులు కూలంకుషంగా ప్రణాళికలలో కనపడాలని, ప్రజల ఆలోచనలు కూడా జిల్లా అభివృద్ధికి అవసరమని తెలిపారు. భోగాపురం ఎయిర్పోర్ట్ వస్తున్న నేపథ్యంలో మామిడి వంటి పంటల వలన మంచి వ్యాపారం జరుగుతుందని అన్నారు. అధికారులందరి సహకారం తో జిల్లాను ముందుకు తీసుకు వెళ్ళడానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒ కీర్తి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చివరి రోజు 461 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శనివారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షతో ఇంటర్ పరీక్షలు ముగిశాయి. చివరిరోజు పరీక్షకు మొత్తం 17383 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 16922 మంది హాజరయ్యారు. 461మంది గైర్హాజరయ్యారని అర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేందుకు సహకరించిన అధికారులకు, అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

18న జాబ్‌మేళా

విజయనగరం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మహారాజ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ స్టడీస్ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఎస్-ఎస్‌సి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బిటెక్, ఏదైనా పి.జిలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈనెల 18న ఉదయం 9గంటల నుంచి ఎంఆర్ స్కూలు ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువతియువకులకు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాకు 26 బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తాయని పేర్కొన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డు, రెస్యూమ్, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 7989826953, 9988853335లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో గురజాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెథమేటిక్స్ ఒలింపియాడ్ ప్రతిభ పరీక్షలో గురజాడ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎస్.పల్లవి, ఎ.సిద్దార్థ్, ఎల్.మారుతి మీరజ్ కుమార్, టియునివిఎల్ భవ్యశ్రీ, ఎం.కౌశిక్, పి.ప్రణీత్ బంగారు పతకాలు సాధించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ఎం వి ఆర్ . కష్ణాజి, పాఠశాల కరస్పాండెంట్ స్వరూప పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ అభినందించారు.

నేడు పలు ప్రాంతాలకు పవర్‌కట్

విజయనగరం టౌన్ : నగరంలోని పలు ప్రాంతాలకు ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్తుశాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు డెంకాడ, సింగపూర్ సిటీ కెవిల పరిధిలో కొత్త బ్రేకర్ల నిర్మాణం నేపథ్యంలో సింగపూర్ సిటీ, జమ్మూ, నారాయణపురం, పడాలపేట, ఆనందపురం, బ్యాంక్ కాలనీ, తాడివాడ, సిఆర్ నగర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.



ర్యాలీ చేస్తున్న వెటర్నరీ విద్యార్థులు

మమ్మల్ని పట్టించుకోరా..?

గరివిడిలో వెటర్నరీ విద్యార్థుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి-చీపురుపల్లి

'మమ్మల్ని పట్టించుకోరా.. మా జీవితాలు ఇంతేనా.. మేము చదువుకునే చదువు వృథాయేనా?' అంటూ గరివిడిలో శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై గత 40 రోజుల నుంచి నిరసన దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో శనివారం వారంతా గరివిడి పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న ధరల దృష్ట్యా స్టైఫండ్ పెంచాలని కోరుతున్నామే తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని వాపోయారు. రూ.7500 స్టైఫండ్ ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని ఆవేదన వ్యక్తంచేశ్నారు. మెడికోలుకు ఇస్తున్నట్లే తమకూ స్టైఫండ్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాశాలకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కూడా తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌చేశారు.

సహకార సంఘాలే కీలకం

పోలిపల్లి రైతు సేవా సహకార సంఘాన్ని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-భోగాపురం

రానున్న రోజుల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకం కానున్నాయని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ డాక్టర్ ఎ.బాబు అన్నారు. ఈ సంఘాల ద్వారానే కేంద్ర పథకాలు అమలు చేయాలని కేంద్రం యోచిస్తున్నట్టు చెప్పారు. భోగాపురం మండలం పోలిపల్లి రైతు సేవా సహకార సంఘాన్ని బాబు శనివారం సందర్శించి కంప్యూటరీకరణ ప్రక్రియపై ఆరా తీశారు. సహకార సంఘాల్లో పెద్ద ఎత్తున సభ్యులను చేర్పించేందుకు కృషి చేయాలని సహకార బ్యాంకు సిబ్బందిని, ప్రజాప్రతినిదులను కోరారు. రానున్న రోజుల్లో అంతా ఆన్‌లైన్ లోనే సంఘాల కార్యకలాపాలు జరుగుతాయని చెప్పారు. సంఘ సభ్యుల ఇకెవైసి నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని, వేలిముద్ర వేయగానే ఆయా సభ్యునికి వున్న భూముల వివరాలు అందులో కనిపిస్తాయన్నారు. దీన్ని వినియోగించుకొని రానున్న రోజుల్లో సహకార సంఘానికి రుణం వచ్చిన వారికి పదిహేను నిముషాల్లో మంజూరు చేయాలని చెప్పారు. ఈ జిల్లాలో సహకార సంఘాల కంప్యూటరీకరణ దాదాపుగా పూర్తి కావచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఇ-పిఎసి పాస్ పుస్తకాన్ని కమిషనర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, మార్క్ ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఆర్‌డిఒ కీర్తి, డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో పెచ్చుమీరుతున్న అవినీతి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం బృందం ఎదుట రైతుల ఆవేదన



బొబ్బిలిరూరల్.. రైతులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శంకరరావు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రెవెన్యూ శాఖలో అవినీతి పెచ్చుమీరుతుందని, ప్రతీ పనికి డబ్బులు అడుగుతున్నారని రైతులు.. సిపిఎం బృందం ఎదుట వాపోయారు. శనివారం బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు ఆధ్వర్యాన ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో ఏ గ్రామానికి వెళ్లినా రెవెన్యూ శాఖలో అవినీతిపై రైతులు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. భూ రికార్డులో తప్పులను సరి చేయాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అలజంగిలో తండ్రి మరణిస్తే భూమి వాటాలు వేసుకుంటే ఆ భూములను ఆన్‌లైన్ చేయాలంటే రూ.లక్ష డిమాండ్ చేస్తున్నారని రైతు ఆరోపించారని చెప్పారు. భూమి క్రయవిక్రయాలు జరిగితే సెంటు భూమికి రూ.వెయ్యి ఇస్తేనే మ్యుటేషన్ చేస్తామంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. భూ రికార్డులలో తప్పులను సరి చేసేందుకు రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. రెవెన్యూశాఖలో అవినీతిని నివారించాలని కోరుతూ ఈ నెల 17న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, రెడ్డి త్రినాథ పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి

శృంగవరపు కోట : గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం మండలంలోని కొండమల్లిపూడి, కాశీపతిరాజపురం గ్రామాల్లో పర్యటించి, అక్కడి గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కొత్తూరు నుంచి కొండమల్లిపూడి, కాశీపతిరాజపురం గ్రామాలకు సుమారు ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మించకపోవడంతో గిరిజనులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. నేటికీ గ్రామాల్లో శ్మశానవాటిక లేకపోవడంతో గెడ్డ కాలువ పక్కన ఖననం చేయాల్సి వస్తోందన్నారు. బకాయి ఉన్న ఉపాధి హామీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, రేషన్ కార్డుపై 35 కిలోల బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ఉత్పత్తులను సేకరించేందుకు జిసిసి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఈ నెల 20న తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆనంద్, మహేష్, మేరి, ఉదయ్, దీప్తి, శ్రీను, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని పేదలకు 2 సెంట్లు భూమి ఇవ్వాలి

విజయనగరం టౌన్ : నగరంలోని ఇళ్లు లేని పేదలకు 2 సెంట్లు భూమి ఇచ్చి 5 లక్షలు మంజూరు చెయ్యాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా శనివారం 22వ డివిజన్ జొన్నగుడ్డి లో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం ప్రభుత్వం పట్టణాల్లో పేదలకు 2 సెంట్లు భూమి ఇస్తామని చెప్పిందని, వెంటనే అమలు చేయాలని, కోరారు జొన్న గుడ్డి పేదలకు చాలా మంది యకులుకు ఇళ్లు లేక అద్దెలు కట్ట లేక, పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పై సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో తమ్మయ్య, రాము, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భూధార్ రద్దు చేయాలి



గజపతినగరం.. మరుపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శ్రీనివాస్

గజపతినగరం : మండలంలోని మరుపల్లి, బొండపల్లి మండలం కనిమెరక గ్రామాల్లో సిపిఎం ప్రజాచైతన్యయాత్ర సాగింది. మరుపల్లిలో ఇంటింటికి మంచినీళ్ల కుళాయిలు కావాలని, భూధార్ రద్దుచేసి డి- పట్టాదారులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, పట్టాలిచ్చిన డి- పట్టాదారులకు భూమి చూపించాలని, నిరుపేదలకు ప్రభుత్వ బంజరు భూమి ఇవ్వాలని, సాగు చేస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, యువతి, యువకులకు కంపెనీలలో పని కల్పించాలని వినతులు అందజేశారు. ఈ సందర్భం గా సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాసమస్యలు తెలసుకొని పోరాటం ద్వారా సాధించుకోవడానికి ఈ యాత్రలు చేపట్టామని తెలిపారు.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులనే వినియోగించాలి

ప్రజల ఆరోగ్యం కాపాడేందుకే ప్లాస్టిక్ పై నిషేధం • స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్ బాబు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించిందని రాష్ట్ర సహకార, వాణిజ్యపన్నుల కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ అహ్మద్ బాబు అన్నారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులో వున్నందున ప్రజలు వాటిని వినియోగించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. మూడో శనివారం సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బి.ఆర్.అంబేద్కర్(బాలాజీ) జంక్షన్ వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన అనంతరం తొలిసారిగా సందర్శించిన బాబుకు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, ఆర్‌డిఒ కీర్తి, మునిసిపల్ కమిషనర్ నల్లనయ్య, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జున తదితరులు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా వినియో గించే క్లాత్, జ్యూట్ బాగులు, ఇతర ఉత్పత్తుల ప్రదర్శనను ప్రత్యేక అధికారి, కలెక్టర్ తిలకించారు. ఒకసారి వినియోగించిన ప్లాస్టిక్ వస్తువులతో గృహాలంకరణ సామాగ్రిగా రూపొందించి ఏర్పాటు చేసిన మరో ప్రదర్శనను ప్రమీల అనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏర్పాటు చేయగా ప్రత్యేక అధికారి ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా విజయనగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుతామంటూ అక్కడకు హాజరైన మహిళలతో, జిల్లా కలెక్టర్, కమిషనర్, జిల్లా అదికారులతో ప్రతిజ్ఞ చేయించారు. పలువురు స్వయంశక్తి మహిళలకు క్లాత్, జ్యూట్‌తో తయారుచేసిన బ్యాగులను అందజేసి వాటినే భవిష్యత్తులో వినియోగించాలని కోరారు. ఆర్‌డిఒ కీర్తి, సెట్విజ్ సిఇఒ ఎ.సోమేశ్వరరావు, జిఎస్‌టి జాయింట్ కమిషనర్ నాగరాజు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కొండపల్లి సాంబమూర్తి, ఎసిపి రమణమూర్తి, 43వ వార్డు కార్పొరేటర్ దాసరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గంటస్థంభం నుంచి డా.బి.ఆర్.అంబేద్కర్ కూడలి వరకు స్వచ్ఛాంధ్రపై స్వయంశక్తి మహిళలతో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది, ఎస్‌హెచ్‌జి మహిళలు

చేపల పెంపకంతో ఉపాధి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ • సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ విధానం పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంకోట



చేపల పెంపకాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

చేపల పెంపకం ద్వారా ఉపాధి పొందేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దీనికోసం అందుబాటులో ఉన్న అధునాతన విధానాలను వినియోగించుకోవాలని సూచించారు. స్థానిక మహిళా ప్రగతి ప్రాంగణంలో జిల్లా సమాఖ్య, సెర్ప్, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ విధానాన్ని మంత్రి శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ప్లాంట్ పనితీరును, చేపలు పెంచే విధానాన్ని, ఫారమ్ పాండ్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కొత్త విధానాన్ని ఏర్పాటు చేసిన ఉదయ్ ఆక్వా ప్రతినిధులతో, డిఆర్‌డిఎ అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ, వెలుగు 2.0 కార్యక్రమం ద్వారా మహిళల జీవనోపాదులు పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. డ్వాక్రా మహిళల ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తున్నామని అన్నారు. సిఎఎస్ విధానంలో చేపలను పెంచడం ద్వారా ఏడాది పొడవునాఉపాధి పొందవచ్చునని చెప్పారు. ఈ యూనిట్ ఖరీదు రూ.4.4లక్షలు కాగా రూ.2.9 లక్షలు రుణం పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎపిడి సావిత్రి, నాబార్డు డిడిఎం నాగార్జున, ఉదయ్ ఆక్వా సిఇఒ ఉదయ్, డిపిఎంలు, ఎపిఎంలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెపండగ బిల్లులు చెల్లించండి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల వేడుకోలు


ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

పల్లె పండగ పనుల బిల్లులు చెల్లించాలని మండల సర్వసభ్య సమావేశంలో రంగరాయపురం ఎంపిటిసి సభ్యులు నారాయణరావు కోరారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి శంబంగి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు బిల్లులపై అడగడంతో పిఆర్ జెఇ రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలో రూ.4 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉందని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. వచ్చే నెలలో చెల్లింపులు చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ ఎడి శ్యామసుందర్ మాట్లాడుతూ మండలంలో ప్రతిరైతు భూధార్ నమోదు చేసుకోవాలన్నారు. 15 వేల మంది రైతులకు గాను 12 వేల మందికి నమోదు చేశామన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆయా శాఖల పనితీరును వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఉన్న విలువ మనుషులకు లేదా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పశువులు కావాలి. కానీ, అదే పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించే మనుషులు అక్కర్లేదు. పాలు కావాలి. అందుకోసం పశువులను మేపాలి. కానీ, ఆ పశుపోషణకు మూలాధారమైన రైతులు మాత్రం అక్కర్లేదు. అచ్చంగా ఇలాగే ఉంది మన జిల్లాలోని ఓ సంఘటన ఆధారంగా కూటమి ప్రభుత్వ పాలన తీరు. దీన్ని బట్టి పశువులకు ఇచ్చిన విలువ.. వాటి పోషణ, వైద్యారోగ్యం చూస్తున్న మనుషులకు ఇవ్వడం లేదన్న స్పష్టంగా అర్థమౌతోందని జనం అంటున్నారు. మన జిల్లాలో స్వర్ణాంధ్రలో భాగంగా పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు వంటి పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆ రంగంలో ఆర్థికాభివృద్ధి పెంచుతామని ప్రణాళిక రూపొందించారు. కానీ, మరోవైపు ఉత్తరాంధ్రలో అతిపెద్దగావున్న విశాఖ పాల డెయిరీ ఆవు పాలసేకరణకు పరిమితులు విధించింది. పాల ధరలు పెంచలేదు సరికదా తగ్గించింది. బోనస్ తగినంతగా ఇవ్వడం లేదు. పశువుల దాణా సరఫరాలో రాయితీలు అంతంతమాత్రమే. అయినా ప్రభుత్వం నోరు మెదపలేదు. దీన్నిబట్టి డెయిరీ యాజమాన్యంపై ఉన్న ప్రేమ పాడి రైతులపై లేదన్నది స్పష్టమైంది. మరోవైపు తమకు ఇంటర్న్‌షిప్ పెంచాలని డిమాండ్ చేస్తూ గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాల విద్యార్థులు నెల 15రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్నారు. వీరంతా ఎంబిబిఎస్ మెడిసిన్, డెంటల్ విద్యార్థులతో సమానంగానే 5 సంవత్సరాల ఆరు మాసాలపాటు యుజి (అండర్ గ్రాడ్యుయేట్) పూర్తిచేయాల్సి వుంటుంది. ఇందులో చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ



కాల వ్యవధిలో ఏదైనా రెండు జిల్లాల్లో ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రులు, పశు సంరక్షణా కేంద్రాలు లేదా జంత ప్రదర్శన శాలల్లో పనిచేయాల్సి వుంటుంది. అక్కడి వైద్యుల పర్యవేక్షణలో వీరంతా సేవలందిస్తారు. మిగిలిన వైద్యుల మాదిరిగా నగరాలు, పట్టణాల్లో ఉండేందుకు అవకాశం ఉండనే ఉండదు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాల్లోనే సేవలు అందించాల్సిన పరిస్థితి ఉంటుందన్న విషయం వేరేగా చెప్పనక్కర్లేదు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిలో ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, భోజనం, వసతి నిమిత్తం 13ఏళ్ల క్రితం అప్పటి ధరలు, ఛార్జీలను బట్టి ఇంటర్న్‌షిప్ రూ.7వేలుగా నిర్ణయించారు. నాటి నుంచి నేటి వరకు అనేక సార్లు ధరలు, ఛార్జీలు, వసతి అద్దెలు పెరిగాయి. అందుకనుగుణంగా ఛార్జీలు పెంచలేదు. మనకన్నా అత్యంత వెనుకబడి ఉందన్న ఒడిశా రాష్ట్రంలో ప్రస్తుతం రూ.14వేలు చొప్పున ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్ చెల్లిస్తున్నారు.

అత్యంత చిన్న రాష్ట్రమైన కేరళలో రూ.17వేలు, పొరుగు రాష్ట్రం తమిళనాడులో రూ.18వేలు, రాజస్థాన్‌లో 23వేలు చొప్పున చెల్లిస్తున్నారు. వాటి మాదిరిగా పెరిగిన ధరలు, ఛార్జీలు, అద్దెలను బట్టి మెడికల్ విద్యార్థులతో సమానంగా రూ.25వేలు చెల్లించాలని ఇక్కడి వెటర్నరీ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన ధరలు, ఛార్జీలు, వసతి సదుపాయాలు ప్రభుత్వానికి తెలియదా? అందులోనూ సనాతన ధర్మాన్ని నెత్తుకెక్కించుకుటున్న ప్రభుత్వం ఆ ధర్మం ప్రకారం పశువుల వైద్యారోగ్యాన్ని కాపాడే తీరు ఇదేనా? దీన్ని బట్టి పశు వైద్యులకు విలువ ఇవ్వకుండా పశువులకు మాత్రమే ఇస్తున్నారన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. దీన్నిబట్టి పాలకులు చెప్పున్నదొకటి, చేస్తున్నది మరొకటి అని పబ్లిక్ టాక్.



ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్ మార్పేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏపి రైతుసంఘం బృందం.. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును కోరింది. ఈ మేరకు విజయవాడలోని సిపిఎం కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతి అందజేసి, రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తిచేసింది. వినతి అందజేసిన వారిలో ఏపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, తదితరులున్నారు.

18న ఇపిఎఫ్ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇపిఎఫ్ కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 18న ఇపిఎఫ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శంకరరావు, ఉపాధ్యక్షులు వి.శేషగిరిరావు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల నుంచి వచ్చిన ఇపిఎఫ్ సొమ్ము రూ.58 వేల కోట్లు ఉంటే, ఆ డబ్బులకు సంవత్సరానికి వడ్డీ రూ.22 వేల కోట్లకు పైగా వస్తుంటే, పింఛను మాత్రం రూ.15,140 కోట్లు ఇస్తున్నారన్నారు. ఏడాది ఇపిఎఫ్ సొమ్ముపై వస్తున్న వడ్డీ రూ.7 వేల కోట్లు మిగులుతుందని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా పింఛను పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ రూ.9 వేలు, రైల్వేలో రాయితీ, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతూ చేపడుతున్న ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణ, ఎస్.గోపాలం, ఆర్.త్రినాథ్ పాల్గొన్నారు.

సన్మార్గంలో లేకుంటే చర్యలు

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్


ప్రజాశక్తి-విజయనగరంకోట

సన్మార్గంలో జీవించకుంటే కఠిన చర్యలు తప్పవని హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులను పోలీసు అధికారులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీట్లు, ఇతర బ్యాడ్ క్యారెక్టర్ షీట్లు కలిగిన వ్యక్తులకు ఎస్పి వకుల్ జిందాల్ ఆదేశాలతో స్థానిక పోలీసు అధికారులు శనివారం పోలీసు స్టేషన్లకు పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్పి మాట్లాడుతూ - రౌడీ షీట్లు కలిగిన వ్యక్తుల ప్రవర్తన, వారు నిర్వర్తించే పనులు, ప్రస్తుత వారి జీవన విధానం పట్ల నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. రౌడీ షీటర్లు దురుసుగా ఉంటూ మళ్లీ నేరానికి పాల్పడే అవకాశం ఉన్నట్లుగా వారి ప్రవర్తన ఉంటే ప్రత్యేకంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. నేర ప్రవృత్తిని విడనాడకుంటే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలన్నారు.

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -తెర్లాం

ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లను ఎంఇఒ జె.త్రినాథరావు పరిశీలించారు. తెర్లాం మండలంలో మూడు కేంద్రాల్లో చేస్తున్న ఏర్పాట్లను శనివారం పరిశీలించారు.



పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఇఒ

పెరుమాలిలోని ఆదర్శ పాఠశాలలో 150, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 171 మంది, తెర్లాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 211 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణ నిమిత్తం అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు బల్లలు, తాగునీరు, టాయిలెట్లు, ఫ్యాన్లు, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 పాపారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మీసేవ ఆపరేటర్ల వినతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మీసేవలో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యే బేబినాయనకు శనివారం మండలంలోని ఆపరేటర్లు వినతి అందించారు. బొబ్బిలి కోటలో ఎమ్మెల్యేను కలిసి, తమ సమస్యలను వివరించారు. మంత్రి లోకేష్ గతంలో ఇచ్చిన హామీని తెలియజేశారు. కార్యక్రమంలో మీసేవ ఆపరేటర్లు మామిడి ప్రసాద్, దాసరి లక్ష్మణరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సారాతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి-బొబ్బిలి

సారాతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు అన్నారు. మండలంలోని కొయ్యాకొండవలసలో శనివారం సారాకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారాతో ఆరోగ్యానికి ప్రమాదమని, సారాకు దూరంగా ఉండాలని కోరారు. సారా తయారు చేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు.

బడిబస్సు నడిపేందుకు చర్యలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలకు బడిబస్సు నడిపేందుకు వీలుగా ఎంపిడిఒ సి.హెచ్.సూర్యనారాయణ చర్యలు చేపట్టారు. శృంగవరపుకోట డిపో నుంచి బడిబస్సు నడపాలంటే కొన్నిచోట్ల సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని ఆర్‌టిసి అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ మార్గాన్ని ఎంపిడిఒ పరిశీలించారు. కరకవలస, డికెపర్తిపేటలో మట్టి వేసి, రోడ్డు బాగు చేయించారు. కరకవలస పాఠశాల వద్ద విద్యుత్తు వైర్లు సరిచేసేందుకు స్తంభాన్ని మార్చాలని ఎఇకి సూచించారు.

మారికలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో మారిక గ్రామంలో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి కె.అజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 40 ఏళ్ల నిండిన వారికి సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడమ్మ, డి.అప్పన్న, హెచ్ఎస్ వి వెంకటరమణ, సిహెచ్‌ఒ ఆంజనేయులు, ఎఎన్ఎమ్మ, జి.జ్యోతి, సిహెచ్ జానకి, ఆర్.రమ్య, బి.పార్వతి, హెచ్ఎస్‌హెచ్ సూర్య నాయుడు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అజయ్

గదబవలసలో సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని గదబవలసలో గిరిజనులు సాగుచేస్తున్న భూముల సర్వేను విఆర్ఒ బి.కామరాజు శనివారం ప్రారంభించారు. ఏళ్ల తరబడి గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు లేక విషయం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో ఆర్‌డిఒ కీర్తి ఆ గ్రామానికి సందర్శించి, సర్వే చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో విఆర్ఒ సర్వే చేపట్టారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో మరిడిమాంబ జాతర సందర్భంగా శనివారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. పోటీల్లో విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు.

50 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో బాడంగి కూడలి వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకొని, 50 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. బాడంగి మండలం పిన్నవలస గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 50 సీసాలు స్వాధీనం చేసుకొని, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని చెప్పారు. అక్రమంగా బెల్టుషాపులు నిర్వహించినా, మద్యం తరలించినా కేసులు తప్పవని హెచ్చరించారు.



బొబ్బిలిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన



గంట్యాడ మండలం మదనాపురంలో ర్యాలీలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

స్వచ్ఛాంధ్ర కోసం.. మేము సైతం


స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించారు. ఇందులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు సైతం భాగస్వాములయ్యారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.



రాజాంలో చీపురు పట్టి చెత్త ఊడ్చుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



పూసపాటిరేగలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



చీపురుపల్లిలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, నాయకులు



నెల్లిమర్లలో చీపురుతో చెత్త ఊడ్చుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, నాయకులు



కొత్తవలసలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, నాయకులు



భోగాపురంలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, నాయకులు



వేపాడ.. గురుకులంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్, సిబ్బంది

రూ.14 కోట్లతో అంగన్వాడీల్లో సౌకర్యాలు

ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి-రామభద్రపురం

అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.14 కోట్లు వెచ్చిస్తుందని ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న అంగన్వాడీ పాల సరఫరా కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీచేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న 13 వేల 819 అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు వంటి సౌకర్యాల కల్పనకు ఈ నిధులు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్‌జెడి చిన్మయిదేవి

కేటాయించిందని తెలిపారు. మంచినీటి సౌకర్యానికి ఒక్కొక్క కేంద్రానికి రూ.17వేలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.35వేలు ఖర్చు చేస్తుందని తెలిపారు. 850 అంగన్వాడీ సెంటర్లలో ఆట వస్తువుల కోసం కోటి రూ.68 లక్షల 30వేలు అందజేస్తుందని తెలిపారు. మోడల్ అంగన్వాడీ సెంటర్ల వద్ద రైన్వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ నిర్మాణానికి రూ.16వేలు ఖర్చు చేస్తున్నామని అన్నారు. 3,173 మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. ఈ సందర్భంగా సరఫరా కేంద్రంలో ఉన్న స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోదాము ఇన్‌ఛార్జి బండారు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఢిల్లీలో ఈనెల 20 నుండి 23 వరకు జరుగనున్న ఖేలో ఇండియా క్రీడా పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి ముగ్గురు పారా క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ తెలిపారు. శనివారం జిల్లా క్రీడాభివృద్ధి కార్యాలయంలో పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత నెల చెన్నైలో జరిగిన 23వ జాతీయ స్థాయి పారాలింపిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కిల్లక లలిత, దొగ్గా దేముడు నాయుడు, సుంకరి దినేష్ లు అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారని, వీరిలో కిల్లక లలిత ఇప్పటికే ఢిల్లీలో జరుగుతున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో ఆడేందుకు వెళ్లగా, మిగిలిన ఇద్దరు త్వరలో ఢిల్లీ బయల్దేరతారని తెలిపారు.

అధికారుల పనితీరుపై నిలదీత

ప్రజాశక్తి-బాడంగి

మండలంలో అధికారుల పని తీరుపై ప్రజాప్రతినిధులు విరుచుకుపడ్డారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. సివిల్ సప్లయి డిటి మాట్లాడుతుండగా మల్లంపేట గ్రామ సర్పంచ్ వంగపండు పద్మ స్పందిస్తూ, గ్రామానికి చెందిన డీలర్ వైజాగ్‌లో ఉంటారని, ఆమె తండ్రేమో ఇక్కడ వేలిముద్ర వేసి పనిచేస్తారని తెలిపారు. గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి పాలవలస భవాని అనే మహిళ తనకు ఇల్లు కావాలని దరఖాస్తు చేస్తే ఇప్పటికీ మంజూరు చేయకపోవడం బాధాకరమని అన్నారు. పెళ్లిళ్లయిన ఆడపిల్లల పేర్లను రేషన్‌కార్డుల్లో తొలగించాలని ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులంతా కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి రామారావు, అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు

వాట్సప్ ద్వారానే సేవలు

వార్డు సచివాలయ తనిఖీలో ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రభుత్వ సేవల కోసం ప్రజలు గ్రామ, వార్డు సచివాలయాలకు రానవసరం లేకుండా రానున్న రోజుల్లో అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ ద్వారానే అందించాలని రాష్ట్ర జి.ఎస్.టి., సహకార శాఖల కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎ.బాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను సులభతరం చేసేందుకు వాట్సప్ గవర్నెన్స్ ను తీసుకువచ్చిందని, దీనిపై సచివాలయం పరిధిలోని ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించి, ప్రతి ఇంటి వద్ద వాట్సప్ గవర్నెన్స్ నెంబరు వుండాలని, దాని ద్వారా ఎలా సేవలు పొందవచ్చో వారికి అవగాహన కలిగించాలని ఆదేశించారు. వచ్చే పర్యటన సమయానికి వాట్సప్ లో లేని సేవల కోసం మాత్రమే సచివాలయానికి దరఖాస్తులు అందాలని, వాట్సప్ గవర్నెన్స్ కింద అందించే సేవలన్నీ ఇంటి నుంచి పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలోని ప్రదీప్ నగర్ ప్రాంతంలో వున్న 41వ నెంబరు వార్డు సచివాలయాన్ని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం ద్వారా ఆ ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలపై సచివాలయ సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. పలు సర్వేల్లో ఒకే విధమైన సమాచారాన్ని ఆయా కుటుంబాల నుంచి సేకరించాల్సి వున్నందున ఒక ఇంటికి వెళ్లినపుడు అన్ని సర్వేలకు అవసరమైన సమాచారాన్ని ఒకేసారి తీసుకోవాలని సూచించారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఆర్‌డిఒ కీర్తి, డిసిసిబి సిఇఒ. ఉమామహేశ్వరరావు, జిఎస్‌టి జాయింట్ కమిషనర్ నాగరాజు పాల్గొన్నారు.

పిఎస్ఆర్ స్కూల్‌లో నాలెడ్జి క్వెస్ట్ పోటీలు

విజయనగరం : నగరంలోని పిఎస్ఆర్ స్కూల్‌లో శనివారం నాలెడ్జి క్వెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల కరెస్పాండెంట్ పాకాలపాటి సన్యాసిరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పతివాడ హెడ్ మాస్టర్ సిహెచ్. అరుణ కుమారి, జెడ్‌పి హైస్కూలు ఇంగ్లీష్ అసిస్టెంట్ డి. శ్రీనివాసరావు పరిశీలకులుగా పాల్గొన్నారు. పోటీలకు పలు పాఠశాలలకు చెందిన 500మంది విద్యార్థులు హాజరయ్యారు. సీనియర్, జూనియర్ విభాగాలలో విజేతలుగా నిలిచిన టాపర్‌కు రూ.1000, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 800, మూడో స్థానం లో నిలిచిన విద్యార్థికి రూ.600, నగదు పారితోషికాన్ని జిల్లా విద్యా శాఖాధికారి చేతుల మీదుగా అందజేయనున్నట్టు కరెస్పాండెంట్ తెలిపారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

భోగాపురం : బిఎస్‌పి వ్యవస్థాపకులు కాన్షీరామ్ జయంతి సందర్భంగా భోగాపురం ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరుకొండ వెంకటరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు బి కాముడు, బోణి అప్పారావు, బోనెల వంశి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పినతాడివాడ సచివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ లెంక లక్ష్మణరావు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, కార్యదర్శి వెంకటరావు ప్రారంభించారు. పెద తాడివాడ సచివాలయం వద్ద కార్యదర్శి అప్పలనాయుడు ఆధ్వర్యాన చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డెంకాడ.. పినతాడివాడ సచివాలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

రామభద్రపురం : రామభద్రపురంలోని షిరిడి సాయిబాబా ఆలయ ఆవరణలో ఉచిత మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రారంభించారు. ఇక్కడ ప్రతీ గురువారం సుమారు 2 వేల మందికి అన్నదానం చేస్తుండడం గమనార్హం. తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసి, తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిడిఒ రత్నం ప్రారంభించారు.

ప్రజలతో మమేకానికే పల్లెనిద్ర

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలు తెలుసుకోవడానికే పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిఐ నారాయణరావు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆరికతోటలో ప్రజలతో మమేకమై పలు చట్టాలు,సైబర్ నేరాలు, శక్తి యాప్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్య వినియోగం, రవాణా, అక్రమ మద్యం, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల మేధావులు వ్యసనాల బాట పట్టి అక్రమ సంపాదన కోసం సైబర్ నేరాలు చేస్తున్నారన్నారు. డిజిటల్ అరెస్టుల పేరిట వైట్ కాలర్ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన ధనవంతులను టార్గెట్ చేస్తూ బెదిరింపులకు దిగి డబ్బులు దోచేస్తున్నారని వీరి ఉచ్చులో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం స్థానిక సచివాలయంలో పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో హెచ్‌సి సుబ్రమణ్యం, వైస్ ఎంపిపి ప్రతినిధి పెంకి శేఖర్ బాబు, అంగన్వాడీ కార్యకర్త శాంతకుమారి, మహిళలు, యువత పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-వంగర

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ షేక్‌శంకర్ హెచ్చరించారు. వంగర విద్యుత్తు సబ్ స్టేషన్ సమీపంలో శనివారం ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వి.ప్రసాద్ పాల్గొన్నారు.



నుజ్జయిన బొలెరో ముందుభాగం



మృతిచెందిన లక్ష్మణరావు

లారీని ఢీకొన్న బొలెరో

డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రైల్వే ఫ్లై ఓవర్‌పై ఎదురుగా వస్తున్న లారీని బొలెరో కారు ఢీకొంది. దీంతో డ్రైవర్ ఎస్. లక్ష్మణరావు(62) మరణించాడు. ముగ్గురు గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ కథనం ప్రకారం... బొబ్బిలి వైపు నుంచి సాలూరు వెళ్తున్న బొలెరో ఫ్లైఓవర్‌పై ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. దీంతో డ్రైవర్ లక్ష్మణరావు, కారులో ఉన్న ఎస్.సుజాత, పి.రాజారత్నం, ఎస్.శిల్ప గాయపడ్డారు. గాయపడిన వారిని ఆటోలో తరలించి, ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. డ్రైవర్ లక్ష్మణరావు తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ జ్ఞానప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే బేబినాయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

IN THE HONOURABLE COURT OF THE I ADDTIONAL JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
O.S. No. 360/2023

Between: -
గొర్లె లక్ష్మి ......Plaintiff
And:
ఇపర్తి ఆదినారాయణ, S/o **తాత** .....Defendant

Notice to the Defendant:

ఇపర్తి ఆదినారాయణ, S/o తాత@నారాయుడు, సెగిడివీధి, నెల్లిమర్ల గ్రామం&మండలం, విజయనగరంజిల్లా. **Hg. Date:18-03-2025**

పైన తెలిపిన కేసులో వాది మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులో పైకోర్టు వారి నుండి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పై నెంబర్ కేసు 18-03-2025 దిన వాయిదా వున్నదని ఈపత్రిక ముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా తే **18-03-2025 దిన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు కానీ లేదా మీతరపున వకీలు గారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీతరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడలపైన తెలిపిన కేసులో మీపరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈప్రకటన ద్వారా తెలియ పరచడమైనది.

// BY THE ORDER OF THE HONOURABLE COURT //

Y. YELLA RAO,
ప్లయింటిఫ్ తరపున న్యాయవాది,
విజయనగరం. సెల్: 9491129188.

IN THE HONOURABLE COURT OF THE III ADDTIONAL JUNIOR CIVIL JUDGE (EXCISE COURT) AT VIZIANAGARAM.
O.S. No. 233/2022

Between: -
కెనరా బ్యాంకు, మెయిన్ బ్రాంచ్, విజయనగరం,
Reptd. by **బ్రాంచ్‌మేనేజర్** ......Plaintiff
And:
గంటసాల వరలక్ష్మి, W/o **లేట్ శ్రీనివాసరావు,** ......Defendant

Notice to the Defendant:

గంటసాల వరలక్ష్మి, W/o లేట్ శ్రీనివాసరావు, డోర్ నెం: 22-2-11/1, చిక్కాలవీధి, విజయనగరంటౌన్& జిల్లా. **Hg. Date:26-03-2025**

పైన తెలిపిన కేసులో వాది మీ పై దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులో పైకోర్టు వారి నుండి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పైనెంబర్ కేసు తే 26-03-2025 దిన వాయిదా వున్నదని ఈపత్రిక ముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగాతే **26-03-2025 దిన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు కానీ లేదా మీతరపున వకీలుగారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీతరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడలపైన తెలిపిన కేసులో మీపరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

// BY THE ORDER OF THE HONOURABLE COURT //

యస్. మధుసూధనరావు,
ప్లయిటింఫ్ తరపున న్యాయవాది,
విజయనగరం.
ఫోన్:9440163944, 9052446888.

PUBLIC NOTICE

Under instructions from my client Sri Manchala Samba Siva Rao, S/o Late Sanyasayya R/o Door No19-7-7, Lanka Street, Vizianagaram,

I am issuing this notice by way publication calling upon the public at large, that My client and 2 others got the property in an extent of 620 Square yards in Door No.19-7-7 Lanka Street MC Ward No.20 Kaspa East, Vizianagaram Town, Vizianagaram District. through a registered will No.98/1972 executed by Smt. Kona Chandramma , Where in my client is the absolute owner of the Residential **Flat No's No.S1,G2,T1, and T2** in Vijaya Chandra Residency. The above named Kona Chandramma purchased the above property from Sri V Poornayya & others under registered Sale Deed vide document No. 1414 /1956 , dated 16-04-1956, for a valuable consideration. When the above said registered sale deed No. 1414 /1956 is in torn condition and because that it will be spoiled in future, my client has laminated the said sale deed.

This is to inform the public at large that if any one got any objection in-respect of the said lamination, inform the same either to me or to my client or to the Branch Manager, State Bank of India, Fort Branch, Vizianagaram within 15 days from the date of this publication, as my client mortgaged the above said property by the above said four Flats bearing **Flat No's No.S1,G2,T1, and T2 to** SBI Fort Branch Vizianagaram by depositing the original Registered Sale Deed, No. 1414 /1956 , dated 16-04-1956,and obtained loan.

P.V.S.PRASAD,
ADVOCATE,
VIZIANAGARAM,
Cell:7799955633.